# ఐ పిటీ యు

"కొందరుంటారు. దె ఆర్ అన్‌ఫిట్ టు లివ్" అన్నారు మా వారు కోర్టు నుండి రాగానే.

రోజూ కోర్టు నుండి రాగానే ఇలాంటి 'ఉవాచ'లు కొన్ని వదలడం అలవాటే. అంచేత నేను "ఎవరా కొందరు? ఏ  మా కథ?" అని అడగలేదు.

ఆ కొందరిలో నువ్వూ ఉన్నావు అంటే!

బెర్నార్డ్ షా నాటకాల కంటె ప్రీఫేస్‌లు పెద్దవి.

అలాగే మా వారి కథల కంటె ఉపోద్ఘాతాలే ఎక్కువ.

"ఛ! ఛ!! బఫూన్లా రూపూ, వీడూను!" మళ్లీ విసుక్కున్నారు.

"ఎవరు?" అడగలేదు నేను.

"ఎవరు నాన్నా!" అడిగింది చిన్న కూతురు.

పిల్లకాకి కదా!

"అమ్మయ్య! థేంక్ గాడ్! ఇంతసేపటికి నువ్వైనా అడిగావు. అరగంట నుండి అరుస్తున్నా అలా చెవు లప్పగించి వింటుందే తప్ప మాట పెగలదు మీ అమ్మకి. కొంపదీసి భయం నటిస్తున్నా దేఁవిటి? వాడేనమ్మా... పార్వతీశం...అంత 'ఫిట్ ఫర్ నథింగ్' గాడ్ని నేను నా జన్మలో చూడలేదు. నల్ల మందు తిన్న వానపాములా ఉంటాడు. వాడ్ని చూస్తే బుద్ధుడిక్కూడా ఒక జెల్ల కొట్టాలనిపిస్తుంది...ఇంక ఆ ఇల్లాలు...ఐ రియల్లీ పిటీ హర్. ..ఆడవాళ్లలో అంత అమాయకత్వం వెరీ రేర్. గంగాళంలా గలగల మాట్లాడుతుందే తప్ప మహా మంచిది. నిజంగా వాడితో ఎలా వేగుతోందో..."

వేగక ఏం చేస్తుంది? నేను మీతో వేగడంలేదా? కట్టుకున్నాక తప్పుతుందా? పశువైతే పలుపుతాడు తెంపుకుని పారిపోతుంది. ఆడది పశువు కంటే హీనం. పశువుకున్న తెగింపు కూడా ఉండదు. పసుపుతాడు పట్టుకుని వేలాడుతుంది. అప్పుడప్పుడు నాకు అనిపిస్తుంది.

ఆడది మొగుణ్ని వదలకపోవడానికి కారణం సెంటిమెంటు, మంగళసూత్రం వగైరాలు కావేమో. ఇవన్నీ పైకి చెప్పే కారణాలు.

అసలు కారణం – ఇంకో మొగుడు ఇంకా మంచివాడన్న గ్యారంటీ ఉండదు కాబట్టి. మరింక ఎవరైతేనేమిటీ అనుకుంటుంది అంతే!

అయితే ఇవేవీ ఆయనతో అనను. అంటే మరింక మనలేను.

ఆయనకి ఆడవాళ్లంటే – నన్ను మినహాయించి చిన్న సాఫ్ట్ కార్నర్.

"ఆడదాన్ని గౌరవించడం మన సాంప్రదాయం. నేను సాంప్రదాయం మనిషిని."

మరే! అవ్వపేరే ముసలమ్మ.

సాఫ్ట్ కార్నర్ పేరే సాంప్రదాయం.

మా వారి జాలి నయాగరా.

అదలా పారుతూనే ఉంటుంది.

ఆయన గుండె కర్బూజా కాయ.

అలా నీరు కారుతూనే ఉంటుంది.

ఇంతకీ అసలు కథ ....

ఆ పార్వతీశం...మా ఫ్రెండ్‌కి కొలీగ్. ఈమధ్యనే ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది.

"పాపం...ఊరు కొత్త. మొగుడు చవట. ఎంత బాధపడుతోందో ఆ ఇల్లాలు – (పాత ఊరైతే చవట మొగుడైనా ఫరవాలేదా!)–నువ్వోసారి వెళ్లు. వెళ్లి ఆ మొగుడికి జతగా అలా కొండ చిలువలా కూర్చోక మనింటికోసారి "టీ"కి రమ్మను. కాస్త మంచి అలవాట్లు చేసుకో. తప్పులేదు."

మంచి అలవాటు చేసుకున్నాను.

ఆవేళ...

మా ఇంట్లో పెళ్లా!

ఛ! మా పిల్లలింకా హైస్కూలు స్టేజి.

ఏ పిల్లయినా బర్త్ డే పార్టీ చేస్తోందా?

మాకు అలవాటు లేదు.

మరేంటిటి?

ఏంటిటి సార్? మీ ఇంట్లో?

"ఏంటిటా నా శార్థం. అసలు నాకు ఎవర్నీ మా ఇంటికి పిలవాల నుండదు. ఎవరైనా వస్తే ఒళ్లంతా సిగ్గుతో చచ్చిపోతుంది. ఇంటి నిండా మాసిన బట్టలు, చిత్తు కాయితాలు, జోళ్లు, పాత పేపర్లు, బూజు - ఒకటేంటిటి? ఈ ఇల్లు కట్టిన తరువాత మళ్లీ ఎప్పుడైన దులిపారా అన్నట్లుంటుంది. ఇవేళ ఆ పార్వతీశం వాళ్లు 'టీ'కి వస్తున్నారు. అంచేత ఏదో కనీసం వాసయోగ్యంగా చెయ్యాలని నా తాపత్రయం. అసలే చాదస్తం మనిషి" అన్నారు మా వారు రెండు బకెట్ల నీళ్లు, డబ్బాడు 'విమ్' ఒలకబోసి.

ఇంట్లో ఉన్న సామానంతా తళతళలాడేటట్లు కడిగేశారు. కర్టెన్లు, టేబిలు క్లాతులు మారిపోయాయి. యాష్ట్రేలు–"వీటిలో సిగరెట్ దులపాలంటే చేతులు రావు" అన్నంత నీట్‌గా ఉన్నాయి.

"ఆవిడకి మిరపకాయ బజ్జీలంటే అసలు తెలీదుట. నేను చెప్తే ఆశ్చర్యపోయింది. నువ్వు, అమోఘంగా చేస్తావని చెప్పాను. వామ్మో, నిమ్మకాయ కక్కుర్తిపడకు" అంటున్న ఆయన్ని ఏమనాలి?

ఇది మిరపకాయలు సీజను కాదని తెలిసి తెగబాధపడ్డారు. ఈసారి సీజన్లో బజ్జీలు చేసి ఆవిడ్ని మళ్లీ 'టీ'కి పిలుస్తానని మాటిచ్చాను.

'నీకు ప్రథమ కోపం కాని, మనిషివి మంచిదానివేనే!'

ఫ్రేము కట్టించి డ్రాయింగ్ రూమ్‌లో పెట్టుకోవాల్సిన సర్టిఫికెట్.

మండుటెండలో మా పెద్దవాడ్ని పంపించి ఓ అయిదు కిలోలు ఐస్ తెప్పించారు.

"తాగడానికా, తలంటుపోసుకోవడానికా?" మా అమ్మ అనుమానం.

తన ఇరవై యేళ్ల సర్వీసులో ముష్టి ఫ్రిజ్ కూడా కొనలేని తన వెధవ ఉద్యోగాన్ని ముప్పైసార్లు తిట్టుకున్నారు.

"అరె...బాప్‌రే...అప్పుడే నాలుగున్నరైంది. ఆవిడ పరమ పంక్చువల్‌ట.

నువ్వింకా ఇలా నూనె కారుతూనే ఉన్నావు. ఇన్నాళ్లు నాతో కాపురం చేసినా నాగుణం ఒక్కటీ అబ్బలేదు నీకు సరికదా అంతా మీ అబ్బ పోలికే. విప్పిన బట్టలు కుర్చీలో పడేసి వాటి మీదే కూర్చుని అవే మళ్లీ తొడుక్కుంటాడు. రాజీవ్ గాంధీ వచ్చినా అలాగే రిసీవ్ చేసుకుంటాడు. దాన్ని సింప్లిసిటీ అనరు. డర్టీ మెంటాలిటీ అంటారు – నీకూ ఆ దిక్కుమాలిన పోలికే వచ్చింది. ఆడపిల్ల తండ్రి పోలికైతే అదృష్టవాఁ? అది మాత్రం కరక్ట్. నాలాంటి మొగుడు దొరకడం అదృష్టం. ఎటొచ్చీ నాకే దురదృష్టం..."

నేను చీర మార్చుకోవడానికి లోపలికి వెళ్లిపోయాను.

నాలుగున్నర దాటింది.

ఆవిడ రాలేదు.

ఐదు కూడా దాటింది.

ఆవిడ జాడలేదు.

మా వారి బి.పి. బియ్యం ధరలా పెరిగిపోతోంది.

"ఒకవేళ ఇల్లు ఆనవాలు తెలీదేమో. మనం పిల్లల్ని ఎవర్నైనా పంపాల్సింది. ఏఁవిఁటో ఖర్మ అన్నీ నేనే చూసుకోవాలి..." మా వారు చిరాకుపడుతుండగా, ఐదున్నర దాటుతుండగా, ఆపసోపాలు పడుతూ వచ్చిం దావిఁడ. వెనక అతను.

మనిషిలో అందం లేదు.

ఆకర్షణా లేదు.

ఎనిమిది గజాల చీర చుట్టబెడితే?! ఏనుగే బావుంటుంది.

మేడ మెట్లు ఎక్కిందేమో అస్త్మా వచ్చిన ఏనుగులా ఆయాసపడుతోంది.

మావారు విక్టోరియన్ టైప్ మనిషి.

ఆవిడ్ని చూడగానే లేచి నిలుచుని "యు ఆర్ వెల్ కమ్" అనబోయారు.

కానీ మా వారి కా ఛాన్సు ఇవ్వలే దావిడ.

గుమ్మంలో అడుగు పెడుతూనే "అబ్బబ్బ ఏం ఎండలండీ ఈ దిక్కుమాలిన ఊళ్లో. గాడిపొయ్యిలో కూర్చున్నట్లుంది" అంటూ సోఫాలో దభీమని కూర్చుంది.

సోఫా ఒక్కసారి మూలిగింది.

నేను మా వారివైపు చూశాను. గడుసుముండావాడు. చూపు తప్పించుకున్నారు.

ఆడది...

"భూమికి నొప్పెడుతుందేమో అన్నట్టు నడవాలి."

"సోఫా కందిపోతుందేమో అన్నట్టు కూర్చోవాలి."

"పెదిమలు విడకుండా నవ్వాలి."

"మనం మాట్లాడిన మాట మనకే వినిపించకూడదు."

ఇవి ఆడదాని గురించి మా వారి అభిప్రాయాల్లో కొన్ని మాత్రమే.

మరి ఈవి డెలా నచ్చిందో?

నా తెలివి తక్కువతనం కాకపోతే మొగాడ్ని – అందునా మొగుడ్ని విశ్లేషించడం వేఁమిఁటి?

"గుంటూరులో ఎండలు ఎక్కువే మరి" అన్నాను ఏఁవీఁ అనకపోతే బాగుండదని.

"ఎక్కువాఁ! నిప్పండీ నిప్పు. గాడిపొయ్యిలో కూర్చున్నట్లుంది. ఇలాంటి ఊళ్లల్లో అయినా ఆఫీసర్లకి ఎ.సి. క్వార్టర్స్ ఇవ్వాలి" అంది మావారిచ్చిన మంచినీళ్లు తాగుతూ.

భేష్! అగ్గిపెట్టెల్లాంటి క్వార్టర్స్‌కే దిక్కులేదు. కాని ఏ.సి. కావాలిట.

అమాయకత్వవాఁ? అహంకారవాఁ?

"ష్యూర్...ష్యూర్" అన్నారు మావారు ఫేన్‌ఫుల్‌గా పెడుతూ.

మాఇంట్లో అందర్లాగే ఫేన్లకీ, లైట్లకీ కూడా ఇండివిడ్యువాలిటీ మహా ఎక్కువ. వాటికి ఇష్టం ఉంటే వెలుగుతాయి. ఆసిలేషన్ తిరుగుతాయి. లేకపోతే అంతే.

ఆవిడంటే ఇష్టంలేదేమో మొదట ఆ ఫేన్ తిరగలేదు.

పార్వతీశం మాత్రం బుద్ధిగా కూర్చున్నాడు. అతన్లో మావారు చెప్పిన మెతకతనం నాక్కనిపించలేదు.

మొహమాటస్తుడు అంతే.

"ఏం తీసుకుంటారు? కాఫీలాంటి మంచి అలవాట్లున్నాయా? కూల్‌డ్రింక్ తీసుకుంటారా?" మావారి ఆఫర్.

"ఇప్పుడేం వద్దండీ" అన్నాడతను టేబిల్ మీదున్న మేగజైన్ తీస్తూ.

"ఆయ నంతేలెండి. కాఫీ తాగితే ఎసిడిటీ, కూల్ డ్రింక్ జలుబు. నాకు మాత్రం ఎంత ఎండగా ఉన్నా సరే కాఫీయే అలవాటు" అందావిడ.

ఆవిడకి కాఫీ, అతనికి మంచినీళ్లు ఇచ్చాను.

"నిజం చెప్పొద్దూ. నాకు ఈ 'బ్రూ'లు అవీ నచ్చవు సుమండీ. ఎంచక్కా ఫిల్టరైతేనే బావుంటుంది" అందావిడ కాఫీ తాగుతూ.

థేంక్ గాడ్! నేను ఫిల్టరే వేశాను.

ఫేన్ వాళ్లకి మాత్రమే తగుల్తోంది. నేను చెమటతో స్నానం చేసేస్తున్నాను. మావారు మాత్రం గడుసుగా లేచి అటూ ఇటూ తిరిగి మళ్లీ కూర్చుంటున్నారు.

"పిల్లలేం చదువుతున్నారో అడుగు" – ప్రాంప్ట్ చేశారు మావారు.

మేము ఎవరింటి కెళ్లినా, మా ఇంటికి ఎవరొచ్చినా నా డైలాగుల స్క్రిప్ట్ ఆయనే రాస్తారు. నేను కేవలం అప్పజెప్పడమే...

అడిగాను.

"ఇంకా ఎలిమెంటరీ స్టేజిలెండి" అన్నాడతను చుట్టూ చూస్తూ.

ఆవిడ మాత్రం "ఏం చదువులో లెండి. శుభ్రమైన కాన్వెంట్ లేదు కదా. సిటీలో మా అమ్మగారింట్లో ఉంచేద్దామంటే ఈయన ఒప్పుకోరు. అంతా నంగిరితనం...అదీగాక స్టూడెంట్ రోజుల్లో కొన్నాళ్లు కమ్యూనిస్టు కబుర్లు చెప్పారు లెండి. ఇంగువ కట్టిన గుడ్డలాగా ఆ వాసన ఇంకా పోలేదు. మునిసిపల్ స్కూల్లో చేర్చమంటారు...ఎంతైనా కాన్వెంట్ డిసిప్లిన్ రాదు కదా..." అంటూ కప్పు రక్కన టేబిల్ మీద పెట్టింది.

"డిసిప్లిన్ సంగతి నాకు తెలియదు కాని పాంకోళ్ల నడకలా ఇంగ్లీషు బూతులు టకటకా వస్తాయి" – అందామనుకున్న నన్ను సభ్యత ఆపేసింది.

ఆవిడకి ఏ ప్రశ్నకీ జవాబు ఒక్క ముక్కలో చెప్పడం రాదు. పేజీలు పేజీలు చెబుతుంది.

"వాళ్లమ్మాయి చాలా చక్కగా బొమ్మలేస్తుంది. తెలుసా?...పదేళ్లుంటాయేమో...(అబ్బే ఇంకా ఏడో ఏడు నడుస్తోంది – సరిచేసిందావిడ)...ఈజిట్! అయితే ఎత్తులో మీ పోలికే నన్నమాట...ఆయిల్స్‌తో వెయ్యమని నేనే చెప్పాను..ఒకప్పుడు నేనూ బొమ్మలు బక్కిరేనులెండి. ఈ మధ్య మా ఆవిడ ఆ సామానంతా కట్టకట్టి అటక మీద దాచేసింది. ఆవిడ పెట్టిన వస్తువు మరింక పోలీసు కుక్కలు కూడా పట్టుకోలేవు. రేపో, ఎల్లుండో వెతికి పంపించు" అని మావారు నాతోను, ఆవిడతోను కలిపి మాట్లాడేస్తున్నారు.

నేనూ, పార్వతీశం కేవలం శ్రోతలం.

"థేంక్యూ...ఏదో మీలాంటి ఫ్రెండ్ దొరకబట్టి కాని లేకపోతే అడక్కండి నా పాట్లు...నాకు సంగీతం అంటే మహా వెర్రి. ఇదిగో ఈ సంసార గుండంలో పడి ఏ సరదా తీరలేదు. కనీసం మా అమ్మాయికైనా నేర్పిద్దామంటే సరైన మేష్టరే లేడుట. ఈ వెధవ ఉద్యోగాలు కావు కానీ పిల్లల ఫ్యూచర్ పాడైపోతోంది. వాళ్ల భవిష్యత్తు తలుచుకుంటే భయం వేస్తుంది" అందావిడ గుండెల మీద చెయ్యి వేసుకుని.

'పిల్లల భవిష్యత్తుకి ఉండాల్సింది బెంగకాదు. బాధ్యత' అంటే? నొచ్చుకుంటుందేమో.

ఇంతకీ సరిగమలు, స్వరజతులు నేర్పడానికి శంకరశాస్త్రి కావాలా?

"నాలాగే నన్నమాట మీరూనూ. మా ఆవిడ నిమ్మకు నీరెత్తినట్లు మహా నిదానంగా ఉంటుందిలెండి. మా ఆవిడ పూర్వాశ్రమంలో కొన్నాళ్లు వీణ వెలగబెట్టిందిలెండి. ఎంత వరకు నేర్చుకున్నావే అమ్మడూ...కృతుల వరకూనా... మరేం. మీ అమ్మాయికి నేర్పుతుందిలెండి..." అని అభయం ఇచ్చి "మరోలా అనుకోకండి. మా ఆవిడ కొంచెం రిజర్వ్‌డ్‌గా ఉంటుంది. (హారా! మీ అబద్ధాలు పాడుగాను. నీ నోరు క్షణం మూతపడదేమే? డబ్బాతో గులకరాళ్లు పోసి గిలకరించినట్లు డబడబలాడుతావు అని తిట్టేది మీరే అనుకుంటాను!) అంచేత నేనే ద్విపాత్రాభినయం చేస్తాను" అని క్షమాపణలు చెప్పకున్నారు.

పార్వతీశం నా కంటే మొహమాటి....అంచేత అలా బొమ్మలా కూర్చున్నాడు. అంచేత నేనే "మీ నేటివ్ ప్లేస్ ఏది?" అన్నాను, అతనికే వినిపించేటంత నెమ్మదిగా.

ఈ డైలాగు మావారి స్క్రిప్ట్ కాదు. నా స్వంతం.

'గోదావరి జిల్లా' అన్నాడతను మరీ నెమ్మదిగా.

బావుంది కాంబినేషన్.

ఆవిడ ఎస్సే టైపు అయితే ఇతను బిట్ పేపరు.

ఆవిడవి పావుగం చెవులు.

"అడుక్కునే వాడికి అన్ని ఊళ్లూ వాడివేనని ఏ ఊరైతేనేంలెండి. ఈ ముష్టి ఉద్యోగం ధర్మవారం అని అడ్డమైన ఊర్లూ తిరుగుతున్నాం. అందులోనూ ఈయన స్పెషాలిటీ ఏంవింటోగాని దరిద్రపు ఊర్లన్నీ దాచి మరీ వేస్తారు ఈయనకి."

ఈవిడ నోటికి ఆన్ స్విచ్ తప్ప ఆఫ్ లేదు.

"సినీమాలు చూస్తారా?" అడిగేను అతన్ని ఆవిడ లెక్చరుకి భయపడి.

కానీ అతనికి ఛాన్సు ఇవ్వలేదావిడ.

"నేను మాత్రం వారానికి నాలుగు సినీమాలు చూస్తాను. ఆయన సంగతి అడక్కండి. రాత్రి ఎనిమిదో గంట ఎప్పుడూ వినరు. ఏం నిద్రో మనిషికి..."

"మా ఆవిడ కూడా సినీమాలు తెగ చూస్తుంది లెండి (ఇవేళ మీకు అబద్ధాల దయ్యం పట్టుకుందేవింటి?) ఏవేం అమ్మడూ. ఈసారి సినిమాకి మీ ఇద్దరూ కలిసి వెళ్తూ ఉండండి..."

నా తరపున మీ ప్రామిస్‌లు ఏంవింటి మహాశయా? ప్రతి ఆడదానికి ఏదో క్షణంలో మొగుణ్ణి చాచి లెంపకాయ కొట్టాలనిపిస్తుంది. అది మాత్రం నిజం. ఇదిగో ఈ క్షణం అలాంటిది.

"నిజం! చాలా థేంక్స్ అండీ...ఇంక ఈయన మీద ఆధారపడనులెండి..." అని వాచీ చూసుకుని తేలు కుట్టినట్టు ఛంగున లేచి "పురుషుడు పుట్టిన ఇన్నాళ్లకి యజ్ఞం చేశాడని, ఇవేళ మావారు సినిమాకి ఒప్పుకున్నారు. ఈ దిక్కుమాలిన హాల్లో ఎడ్వాన్స్ బుకింగ్ కూడా లేదట. వస్తానండి...రండి మా ఇంటికోసారి" అంటూ బైల్దేరింది.

అతను లేచి "వస్తానండీ" అని నమస్కారం పెట్టాడు.

వాళ్లు వెళ్లిపోయాక మావారు "యామ్ ఐ రాంగ్? పాపం ఎంత భోళా మనిషో చూశావా?" అని అంతలోనే రహస్యం చెపుతున్నట్లు

"ఔను! రాత్రి ఎనిమిది కాకుండా పడుకునే వాడు పెళ్లెందుకు చేసుకున్నాడంటావ్!" అన్నారు అదేదో జోక్‌లాగా.

"కుళ్లు జోకులెయ్యకండి. అతను మంచివాడు కాబట్టి ఎనిమిది గంటల వరకు ఆగుతున్నాడు. నేనైతే పగలు కూడా పడుకుంటాను ఏ కాంపోజో వేసుకుని" అంటున్న నన్ను రెచ్చిపోయి చూశారు.

"ఏదైనా ఐ పిటీ హర్" అంటున్న ఆయన మీద నాకు కోపం రాలేదు.

"ఐ పిటీ యు" అన్నాను.

*("ఆంధ్రప్రభ" వారపత్రిక ఏప్రిల్ 14–20, 1993)*

★ ★ ★